క్లుప్తంగా

గ్రామసంఘ కార్యాలయం ప్రారంభం



గ్రామసంఘం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ జయ

ఆమదాలవలస రూరల్: మహిళా స్వయంశక్తి సంఘాల అభివృద్ధి చెందడానికి గ్రామసంఘం కార్యాలయం ఎంతగానో దోహదపడుతుందని సర్పంచ్ గురుగుబెల్లి జయ అన్నారు. మండలంలోని అక్కివరం గ్రామ పంచాయతీలో గ్రామసంఘం కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. సంఘాలు సమావేశాలు నిర్వహించుకుని, కార్యక్రమాలను అవగాహన పెంపొందించడానికి ఈ కార్యాలయం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కో ఆర్డినేటర్ రమణ, వీఓఏ రాజేశ్వరి, మహిళలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ర్యాలీ నిర్వహిసున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: చిన్ననాటినుంచే ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని భగవాన్ సత్య సాయి భజన మండలి కన్వీనర్ ఎ.నారాయణ రావు అన్నారు. మండలంలోని శ్యామలాపురం గ్రామంలో అఖిల భారత బాలవికాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ర్యాలీ నిర్వహించారు. బాల్యం నుంచే సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. నగర సంకీర్తన, సామూహిక బాలవికాస్ పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాలవికాస్ గురువు లావేటి శైలజ, సాయికృష్ణ, సత్యసాయి యూత్ కో ఆర్డినేటర్ దుర్గారావు, పలువురు చిన్నారులు, పలువురు భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

భక్తిభావం కలిగి ఉండాలి



సత్సంగం నిర్వహిస్తున్న ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు, భక్తులు

బూర్జ: మండలంలోని బూర్జ గ్రామంలో కృష్ణాష్టమి వేడుకల్లో సత్సంగం నిర్వహించారు. భక్తులు దర్శనం చేసి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి వారు 6 రోజులు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో భాగంగా 5వ రోజు ఘనంగా చేపట్టారు. శ్రీకృష్ణ భగవాన్ విగ్రహానికి అత్యంత భక్తిభావాలతో కృష్ణుడిని పూజించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొత్తూరు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఎంటీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని రాయల గ్రామంలో రైతులుకు కషాయాల తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరిలో పోషక లోపాలు గుర్తించడం వల్ల జిల్లేడు ద్రావణం తయారు చేసి, పిచికారీ చేసే విధానాన్ని యూనిట్ ఇన్‌చార్జి జగన్ వివరించారు. రానున్న రోజుల్లో మానవ మనుగడ సాగించాలంటే ప్రకృతి వ్యవసాయం తప్పనిసరిగా చేయాలన్నారు. మండలంలోని రాయల, లబ్బ, అల్తి గ్రామ పంచాయతీలలో గిరిజన గ్రామాలు ఎక్కువ ఉండడం వల్ల ప్రకృతి వ్యవసాయం చేయడానికి ఎక్కువగా మొగ్గు చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమానికి ఎంసీ ఆర్‌సీ జనార్దనరావు, సీఆర్పీ ధనలక్ష్మి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

న్యాయమే గెలిచింది

స్కిల్‌డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయిన మాజీ సీఎం చంద్రబాబుకు ఏసీబీ కోర్టు 14 రోజులు రిమాండ్ విధించడం సబబేనని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తప్పు చేసిన వారు ఎంతటివార్తైనా శిక్ష తప్పదని.. చట్టం దృష్టిలో అందరూ సమానమేనన్నారు. చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించడంతో న్యాయం గెలిచిందని నిరూపణ అయిందన్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన మిగిలిన టీడీపీ నాయకులను కూడా విచారించి శిక్షపడేలా చూడాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

స్పష్టమైన ఆధారాలతోనే అరెస్ట్



చట్టం ముందు అందరూ సమానమే. ఎవరికీ మినహాయింపు ఉండదు. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తులపై ఇటువంటి అభియోగాలు వచ్చేటప్పుడు నిర్దోషత్వాన్ని నిరూపించుకోవాలి. అంతేతప్ప కక్ష సాధింపు అని మాట్లాడటం సమంజసం కాదు. కక్ష సాధించాలంటే రెండున్నరేళ్లు ఆగవలిసిన అవసరమే లేదు. స్పష్టమైన సాక్ష్యాధారాలు ఉండటంతోనే కేసు నమోదు చేశారు.

– సువ్వారి గాంధీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, పొందూరు

చట్టం ఎవరికీ చుట్టం కాదు...



చట్టం ఎవరికీ చుట్టం కాదు. చట్టం తన పని చేసింది. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు. రిమాండ్ విధించడం సమంజసమే. సాక్ష్యాధారాలు ఉండటంతోనే కేసు నమోదు చేశారు. ఇటువంటి సందర్భంలో తన సచ్ఛీలతను నిరూపించుకోవాలే తప్ప.. అభాండాలు వేయడం సమంజసం కాదు.

– లోలుగు కాంతారావు, జెడ్పీటీసీ, పొందూరు

తప్పు చేస్తే శిక్ష తప్పదు



ప్రజాధనాన్ని దోపిడీ చేసిన వ్యక్తులు ఎలాంటి వారైనా శిక్ష అనుభవించక తప్పదు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో కోట్లు దోచుకున్నందున, సీఐడీ వద్ద పక్కా ఆధారాలు ఉన్నందునే చంద్రబాబుకి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. యువతీ, యువకులను మోసం చేసి టీడీపీ నాయకులు వారి సొంత జేబుల్లోకి సొమ్ములను తరలించడం చట్ట విరుద్ధం. ఇలాంటి వారికి తగిన శిక్ష పడుతుంది.

– తమ్మినేని శ్రీరామ్మూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, ఆమదాలవలస రూరల్

అవినీతి బయటపడింది



చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రజల సొమ్ము కాజేశారు. దీనికి ఉదాహరణ స్కిల్‌డవలప్‌మెంట్ స్కామే.. టీడీపీ హయాంలో జరిగిన అన్ని పథకాలు, నీరు–చెట్టు పథకంపై పూర్తి విచారణ చేపడితే టీడీపీ నాయకుల బండారం మరింతగా బయట పడుతుంది. నేను నిజాయతీ పరుడ్ని.. అని గొప్పలు చెప్పుకున్న చంద్రబాబు అవినీతి ఇప్పుడు బయటపడింది. ప్రజలందరూ టీడీపీ దోపిడీని గమనించాలి. చంద్రబాబు ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడ్డారు అనేది రుజువు కావడంతో ఆయనకు రిమాండ్ ప్రకటించారని ప్రజలు గమనించాలి.

– చీపురు రాణి, రాష్ట్ర శ్రీశైన కార్పొరేషన్ చైర్‌పర్సన్, నరసన్నపేట

ఎవరూ అతీతులు కాదు



చట్టం తనపని తాను చేసుకు పోతుందని, చట్టానికి ఎవరూ అతీతులు కారని, చట్టం ఎవరికి చుట్టం కాదని ఎంపీపీ కర్నేన దీప అన్నారు. వ్యవస్థలపై నమ్మకం పెంచేలా దర్యాప్తు సంస్థలు పని చేస్తున్నాయన్నారు. తప్పు చేసిన వారు ఎంతటివారైనా శిక్షతప్పదు.

– మండల ఎంపీపీ కర్నేన దీప, బూర్జ మండలం

దోషుల్ని శిక్షించాలి



స్కిల్‌డెవలప్‌మెంట్ స్కీమ్‌కు సంబంధించి చంద్ర బాబు రూ. 371 కోట్ల నిధులను అక్రమంగా కొల్లగొట్టారని కోర్టులో నేరం రుజువైంది. తప్పు చేస్తే ఎలాంటివారికైనా శిక్షతప్పదని సీబీఐ కోర్టు నిరూపించింది. దర్యాప్తు సంస్థలు, సీఐడీ విభాగం తీసుకున్న నిర్ణయానికి స్వాగతిస్తున్నాం.

– జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, బూర్జ మండలం

చట్ట ప్రకారమే అరెస్టు



చట్టానికి లోబడే సీఐడీ అధికారులు చంద్రబాబును అరెస్టు చేశారు. స్కిల్‌డవలప్‌మెంట్ స్కామ్‌కు తెర తీశారు. కోర్టు కూడా దర్యాప్తు సంస్థ అధికారులు చూపిన ఆధారాలతో న్యాయస్థానం రిమెండ్‌కు పంపింది. చట్టం ముందు ఎవరైనా సమానమే.

– మీసాల రజిని, ఎంపీటీసీ సభ్యురాలు, హిరమండలం

తప్పు చేసినవారికి శిక్షతప్పదు



14 ఎళ్లు సీఎంగా ఉండి ఎన్నో వ్యవస్థలను చంద్రబాబు మేనేజ్ చేశారు. చట్టం ఎవరికీ చుట్టం కాదు. చట్టం ముందు అంతా సమానులే అని మరోసారి రుజువు అయింది. తప్పు చేసిన వారు ఎంతటివారైనా శిక్ష నుంచి తప్పించుకోలేరన్నది నిజం.

– వాన గోపి, ఎంపీపీ, జలుమూరు

చట్టం ముందు అందరూ సమానులే



చంద్రబాబుకు న్యాయస్థానం 14 రోజులు రిమాండ్ విధించడంతో ఆర్థిక నేరస్తులు ఎంతటివారైనా చట్టం నుంచి తప్పించుకోలేరు. ఎన్నో కేసులు నుంచి స్టేలు తెచ్చుకున్న చంద్రబాబు ఈ కేసులో అన్ని సాక్ష్యాలతో సీఐడీ పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్ విధించారు.

– ఎం.శ్యామలరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు, అల్లాడ, జలుమూరు

అడ్డంగా దొరికాడు



వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వస్తున్న చంద్రబాబు అడ్డంగా దొరికాడు. స్కిల్‌డవలప్‌మెంట్ స్కీమ్‌లో స్కామ్ చూస్తూ దొరికాడు. అవినీతి చేస్తే ఎవరికైనా శిక్ష తప్పదు. రాష్ట్రాన్ని లూటీ చేసిన బాబుకు తగిన శిక్ష వేయాలి.

– వి.చిన్నారావు, జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి, హిరమండలం

అవినీతి గుట్టురట్టు



స్కిల్‌డవలప్‌మెంట్ ప్రాజెక్టులో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రజాధనాన్ని లూటీ చేసిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతి గుట్టు రట్టుఅయింది. నిజాయతీ పరుడని చెప్పుకుని తిరిగే చంద్రబాబు చట్టానికి అడ్డంగా చిక్కాడు.

– అల్లు కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, హిరమండలం

ధర్మం గెలిచింది



చంద్రబాబును అరెస్ట్ చేయడం ద్వారా ధర్మం గెలిచింది. ఇన్నాళ్లు వ్యవస్థలన్నింటినీ చంద్రబాబుకు తన గుప్పెట్లో పెట్టుకున్నారు. ప్రభుత్వ సొత్తును, ప్రజల సొమ్మును అక్రమంగా ప్రక్కదొవ పట్టించి తన స్వార్థానికి వినియోగించుకున్నారు.

– చింతాడ రవికుమార్, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి, ఆమదాలవలస

స్కాం చేసినందుకే రిమాండ్ విధింపు



స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ.371 కోట్లు అక్రమంగా దోచుకున్న ఆర్థిక నేరస్థునిగా కోర్టు పరిగణిస్తూ రిమాండ్ విధించింది. ఇప్పటికైనా టీడీపీ నాయకులు చట్టాలపై అవగాహన తెలుసుకుని మాట్లాడితే మంచిది. కోర్టులో సీఐడీ నుంచి పక్కా ఆధారాలు అప్పగించడంతోనే చంద్రబాబుకి ఇలాంటి గతి పట్టింది. న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందని మరోసారి ఈ కేసు ద్వారా తెలుస్తుంది.

– బెండి గోవిందరావు, జెడ్పీటీసీ, ఆమదాలవలస రూరల్

నిజం నిప్పులాంటిది



వేల మంది నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లి అవినీతికి పునాదివేసిన చంద్రబాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించడంతో ధర్మం గెలిచింది. నిజం నిప్పులాంటిది, దానికి చెద పట్టదు అనే విషయం తేట తెల్లమైంది. స్కిల్‌డవలప్‌మెంట్ చేస్తామని యువతను మోసగించి ఆ సొమ్ములు దోచేయడంపై దేవుడు కూడా క్షమించడు.

– తమ్మినేని చిరంజీవినాగ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి, ఆమదాలవలస

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- ఎన్నిరామన్నపేటలో రోడ్డు పనులకు భూమిపూజ



ఎన్నిరామన్నపేటలో రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని ఎన్ని రామన్నపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం చెందిన రూ.11.00 లక్షల నిధులతో రోడ్డు పనులకు ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో గ్రామాల్లోని సీసీ రోడ్లు, కాలువలతోపాటు పలు రకాల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వం పలు రకాల పథకాలతోపాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చింతాడ సూర్యానారాయణ, వైఎస్సార్ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, పార్టీ నాయకులు సారిపల్లి భారతి, వై.ధర్మారావు, ఎస్.వెంకటరావు, ఎల్.తిరుపతి రావు, జి.ఆనందరావు, ఎం.పూర్ణ, పంకజ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోయిన టీడీపీ కార్యాలయం



నరసన్నపేటలో వెలవెలబోయిన టీడీపీ కార్యాలయం

నరసన్నపేట: స్కిల్‌డవలప్‌మెంట్ స్కామ్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు బెయిల్ వస్తుందని ఆదివారం రాత్రి 7.30 గంటలవరకు స్థానిక టీడీపీ నాయకులు ఆశించారు. కచ్చితంగా బెయిల్ వస్తుందని పార్టీ అధిష్టానం నుంచి స్థానిక నాయకులకు సమాచారం రావడంతో బెయిల్ వచ్చిన వెంటనే స్వీట్లు పంపిణీ చేసేందుకు, బాణసంచా కాల్చేందుకు టీడీపీ శ్రేణులు ఏర్పాట్లు చేశాయి. ఏసీబీ కోర్టు న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధిస్తున్నట్లు ప్రకటించడంతో టీడీపీ శ్రేణులు డీలాపడ్డాయి. దీంతో నరసన్నపేట ఇందిరానగర్‌లోని టీడీపీ కార్యాలయం వెలవెలబోయింది. ఒక్క కార్యకర్త కూడా కనిపించలేదు. అలాగే వీధుల్లో కూడా టీడీపీ కార్యకర్తలు కనిపించలేదు. ఉదయం నరసన్నపేటలో దీక్షలు చేపట్టిన టీడీపీ కార్యకర్తలు, నాయకులను నరసన్నపేట పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు.

పేరుకుపోయిన గుర్రపుడెక్క



ఇస్కలపాలెం సమీపంలోని కాలువలో గుర్రపు డెక్క

సరుబుజ్జిలి: మండలంలోని యరగాం–పురుషోత్తపురం ఓపెన్ హెడ్ చానల్‌లో గుర్రపు డెక్క తొలగించాలని రైతులు కోరుతున్నారు. గుర్రపు డెక్క ఉండడం వల్ల సాగునీరు దిగువకు ప్రవహించక సాగునీటి ఇబ్బందులు వస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నిరసనలోనూ విభేదాలు

పాతపట్నం: మాజీ సీఎం చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో నియోజకవర్గ కేంద్రమైన పాతపట్నంలో ఆదివారం తెలుగుదేశం పార్టీలో వర్గాలుగా చీలి నిరసన తెలియజేశారు. ఓ వైపు రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ ఒక శిబిరం, మరో వైపు మామిడి గోవిందరావు మరో శిబిరం నిర్వహించి నిరాహార దీక్షలు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకూడదనే ఆలోచనతో పోలీసులు వీరిని అరెస్టు చేశారు. అనంతరం విడుదల చేశారు.

'చదవడం మాకిష్టం'



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

సారవకోట: మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ స్మారక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. లైబ్రేరియన్ సాయమ్మ గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులతో విజ్ఞాన పుస్తకాలను చదివించారు. ప్రతీ ఆదివారం పలువురు విద్యార్థులు హాజరై వివిధ విజ్ఞాన, కథల పుస్తకాలను చదువుతున్నట్లు తెలిపారు.

83 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి : మండలంలోని గొప్పిలిలో శ్రీకాకుళం పట్టణానికి చెందిన లోటస్ ఐకేర్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ పల్లి జయసుధ ప్రారంభించారు. పలాస సీహెచ్‌సీ సూపరింటెండెంట్ (ఎండీ జనరల్ మెడిసిన్) అగ్గన మేఘన ఆధ్వర్యంలో 83 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 29 మందికి ఆపరేషన్లు చేయడానికి తరలిస్తామన్నారు. శంకర్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కూన అరుణకుమారి, పారామెడికల్ కంటి వైద్యసహాయకులు దివాకర్, స్థానిక నాయకుడు పల్లియోగి తదితరులు పాల్గొన్నారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం



నడక పోటీలకు జెండా ఊపుతున్న సత్యం

శ్రీకాకుళం అర్బన్: నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని వాకర్స్ గవర్నర్ కె.సత్యం అన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సూర్యా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన నడక పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన వ్యాయామం లేకపోవడం, ఆహారపు విషయంలో సమయం పాటించకపోవటం, బయట చిరుతిళ్లు వంటి కారణాల వల్ల చిన్న వయసులోనే రోగాల బారిన పడుతున్నారన్నారు. ఈ పరిస్థితులు గ్రహించి వాటిని అధిగమించేందుకు దేశవ్యాప్తంగా వాకర్స్ క్లబ్‌లు వెలిశాయని సత్యం అన్నారు. అన్ని వయస్సుల వారు వాకర్స్ క్లబ్స్‌లో చేరి ఆరోగ్యానికి రక్షణ కల్పించుకోవాలని పిలుపునిచ్చారు. వ్యాయామాల్లో నడక అనేది తెలికపాటి వ్యాయామం అని, నడకతో అనేక రోగాల నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. నడక అనేది దివ్యౌషధం వంటిదని, గుండె పనితీరు క్రమబద్ధం చేయటంలోపాటు ఆరోగ్యం నిలకడగా ఉంచేందుకు దోహదపడుతుందన్నారు. ఉదయం పూట వాకింగ్ చేస్తే రోజంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండవచ్చన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు మాట్లాడుతూ శ్రీకాకుళం నగరంలో ఉన్న వాకర్స్ క్లబ్స్ అన్నీ స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ శ్రీకాకుళం సాధనలో క్రియాశీలక పాత్ర పోసిస్తున్నాయన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్లు గేదెల ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, కూన వెంకటరమణ మూర్తి, పి.జి.గుప్తా, సూర్యా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బెవర శ్రీరాములు, నలినీ సుధాకర్, సురేశ్ పండా, అన్నెపు సత్యనారాయణ, చలం, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బి.దేవీప్రసాద్, గోలీ సంతోష్, ఎస్.సంజీవరావు, వై.మోహన్, గోలీ ఉమామహేశ్వరరావు, మారుతీ వాకర్స్ క్లబ్ ప్రతినిధి కొంఖ్యాన మురళి తదితరులు ఉన్నారు.

రహదారే పశువుల శాల



రహదారిపై కట్టిన పశువులు

సరుబుజ్జిలి: మూలసవలాపురం పంచాయతీ పరిధిలోని తురకపేట రహదారిపై పశువులు కట్టడం వల్ల అధ్వానంగా మారుతుందని గ్రామస్తులు అరవల భాస్కరరావు, దాసరి దాలింగి రావు, దాసరి ఆదినారాయణ, పర్లపెంటయ్య, దాసరి జగదీష్ తెలిపారు. అలాగే రహదారిపైనే ట్రాక్టర్లు నిలుపుదల చేస్తున్నారని, దీనివల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. పంచాయతీ అధికారులు స్పందించాలని కోరారు.

జాడుపల్లిలో సినిమా షూటింగ్ సందడి

మెళియాపుట్టి: మండలంలోని జాడుపల్లి గ్రామంలో ఆదివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. మండలంలోని చీపురుపల్లి గ్రామానికి చెందిన రాజాన మోహన్ అనే యువకుడు స్వీయ నిర్మాణం, దర్శకత్వం, కథా నాయకుడిగా నటిస్తూ.. తెరకెక్కిస్తున్న దేశాయ్ చిత్రం తెరకెక్కిస్తున్నారు. అందులో భాగంగానే జాడుపల్లిలోని ఓ కిరాణా షాపులో ఆదివారం కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఆర్ఎంఆర్ ఫిల్మ్ ఫ్యాక్టరీ ద్వారా చిత్రాన్ని నిర్మిస్తున్నామని, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, నిర్మాణం, కథానాయకుడు అన్నీ తానేనని రాజాన మోహన్ తెలిపారు. చిత్రీకరణ శరవేగంగా జరుగుతున్నట్లు తెలిపారు.



దేశాయ్ సినిమాలో సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం